
www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 26 జూన్ 2024
5
ఏలూరు



ఆర్‌టిసి బస్సులో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్



బస్సులో అప్పారావు మృతదేహం

జంగారెడ్డిగూడెం డిపోకు చెందిన బస్సులో ఒక వ్యక్తి అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. కోరుకొండకు చెందిన అప్పారావు(55) కామవరపుకోట నుంచి జంగారెడ్డిగూడెం వెళ్లేందుకు బస్సు ఎక్కాడు. బస్సు జంగారెడ్డిగూడెం డిపోలోకి వచ్చిన అనంతరం అప్పారావు దిగకుండా బస్సులోనే ఉండిపోయాడు. సిబ్బంది పరిశీలించగా మృతి చెందినట్లు గుర్తించారు. ఆర్‌టిసి అధికారులు అతని వద్ద ఉన్న ఫోన్ సాయంతో మృతుని బంధువులకు సమాచారం అందించారు. దీంతో మృతుని బంధువులు వచ్చి అప్పాఆరవు మృతదేహాన్ని అతని స్వగ్రామం కోరుకొండకు తీసుకెళ్లారు. అప్పారావుకు ఆస్తమా ఉన్నట్లు బంధువులు తెలిపారు.

క్షేత్రస్థాయి పాలన పట్టాలెక్కేదెప్పుడో..!

బదిలీల కోసం మండలస్థాయి అధికారుల ఎదురుచూపు

ప్రజా సమస్యలపై నేతల సిఫార్సు మేరకే స్పందన



ప్రజాశక్తి - డెస్క్

సార్వత్రిక ఎన్నికల పర్వం ముగిసింది. కేంద్రంలోను, రాష్ట్రంలోను కొత్త ప్రభుత్వాలు కొలువుదీరాయి. రెండు జిల్లాలకు కొత్త కలెక్టర్లు నియమితులయ్యారు. అయినా పాలన పట్టాలెక్కేదెప్పుడోనని జనం ఎదురుచూడాల్సిన పరిస్థితి దాపురించింది.

మార్చి 16న ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో కోడ్ అమల్లోకి వచ్చి యంత్రాంగమంతా ఎన్నికల విధుల్లో నిమగ్నమయ్యారు. సాధారణంగా సాగే ప్రజా ఫిర్యాదుల స్వీకరణ సైతం నిలిచిపోయింది. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యి ఫలితాలు వెలువడిన అనంతరం జూన్ ఆరో తేదీన ఎన్నికల కోడ్ తొలగించారు. అంటే సుమారు రెండు నెలల 20 రోజులు కోడ్ అమలులో ఉండటంతో ప్రజా సమస్యలన్నీ ఎక్కడికక్కడ పేరుకుపోయాయి. కోడ్ తొలగి సుమారు 20 రోజులవుతున్నా ఇప్పటికీ పాలనా కార్యక్రమాలు పూర్వ స్థితికి చేరలేదు. గత ప్రభుత్వ విధానాల ఫలితంగా ఏర్పడిన ఇబ్బందుల నుంచి జనం ఉపశమనం కోరుకుంటున్నారు. ప్రధానంగా ధరా భారంతోపాటు చెత్త పన్ను ఇతర భారాల ఉపసంహరణ కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. వీటిపై ప్రభుత్వం విధానపర నిర్ణయాలు తీసుకుని అమలు చేస్తేగాని ప్రజానీకానికి ఉపశమనం దక్కే అవకాశం లేదు. ఈ క్రమంలో కొత్తగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు ఇప్పుడిప్పుడే తమ కార్యకలాపాలను ముమ్మరం చేశారు. జనం సమస్యలను క్షుణ్ణంగా తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ప్రా ధాన్యతాక్రమంలో వాటిని పరిష్కరిస్తామని, ఆందోళన చెందొద్దంటూ భరోసా ఇస్తున్నారు. ఇంతవరకూ బాగానే ఉంది. కొత్త ప్రజాప్రతినిధులొచ్చారు.. కొత్త కలెక్టర్లు నియమితులయ్యారుగాని ఎన్నికల బదిలీల్లో భాగంగా ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలకు వచ్చిన మండలస్థాయి అధికారులు ఇంకా అక్కడే విధుల్లో ఉన్నారు. వీరంతా తమ సొంత జిల్లాలకు ఎప్పుడెళ్తామా అనే మూడ్‌లో ఉన్నారు. ఈ క్రమంలో తమ సొంత జిల్లాల్లో తమకు అనువైన ప్రాంతాల్లో నియామక ఉత్తర్వులు పొందేందుకు ఆయా ప్రాంతాల ప్రజాప్రతినిధులు, నేతలను కలిసే పనిలో వీరంతా నిమగ్నమయ్యారు. ఎంఎల్‌ఎలు, జిల్లా అధికారులు తమ ప్రాంతాలకు వచ్చినప్పుడే వీరు ఎక్కువ అందుబాటులో ఉంటున్నారు. కొత్త ఎంఎల్‌ఎలు సైతం తమకు అనుకూలంగా ఉండే అధికారుల కోసం అన్వేషిస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ప్రజాప్రతినిధులు, నేతలు సిఫార్సు చేసిన వినతులు, అంశాలపైనే అధికారులు స్పందిస్తున్నారు. క్షేత్రస్థాయిలో తాగునీరు, ఇతర అత్యవసర అంశాలపైనా ఉన్నతాధికారులతో సంప్రదించి అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. అంతేగాని రోజువారీ దైనందిన కార్యకలాపాలపై డివిజన్, మండలస్థాయి అధికార యంత్రాంగం పెద్దగా దృష్టి సారించడం లేదనే విమర్శలు విన్పిస్తున్నాయి. ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి బుధవారం బాధ్యతలు స్వీకరించబోతున్నారు. పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ నాగరాణి కూడా రెండు రోజుల్లో బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉంది. కలెక్టర్లు బాధ్యతలు స్వీకరిస్తే బదిలీల పర్వం ప్రారంభమవుతుందని తెలుస్తోంది. అదే జరిగి కొత్త అధికారుల నియామకం జరిగితే వారం, పది రోజుల్లో క్షేత్రస్థాయి అధికార యంత్రాంగం గాడిన పడే అవకాశం ఉంది. ప్రభుత్వ విధానపర నిర్ణయాలు, పథకాల మాట ఎలాగున్నా తాము రోజువారీ ఎదుర్కొంటున్న స్థానిక సమస్యలు కొన్నయినా పరిష్కారమవుతాయని జనం ఎదురుచూస్తున్నారు. ఆ దిశగా ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు త్వరిగతిన చర్యలు చేపట్టాలని అంతా కోరుతున్నారు.

నేడు విధుల్లోకి కొత్త కలెక్టర్

బాధ్యతలు స్వీకరించనున్న వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు



ఏలూరు జిల్లా కలెక్టర్‌గా నియమితులైన కె.వెట్రిసెల్వి బుధవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఆమె తొలుత ప్రకాశం జిల్లాలో శిక్షణా కలెక్టర్‌గా పని చేశారు. 2016 నుంచి ఏడాదిన్నరపాటు మదనపల్లి సబ్‌కలెక్టర్‌గా పని చేస్తూ కుప్పం నియోజకవర్గ ప్రత్యేక అధికారిగా అదనపు బాధ్యతలు నిర్వహించారు. నెల్లూరు జిల్లా జాయింట్ కలెక్టర్‌గాను, సమగ్ర శిక్షా ఎస్‌పీడీగా పని చేశారు. చిన్నవయస్సులోనే 2014లో సివిల్స్‌లో 143వ ర్యాంకును సాధించిన వెట్రిసెల్వి కుప్పం స్పెషల్ ఆఫీసర్‌గా ప్రతిభ చూపారు. భూసమస్యలన్నింటినీ తనదైన శైలిలో పరిష్కరించారు. 2024 ఫిబ్రవరి నుంచి స్త్రీ శిశుసంక్షేమ శాఖ డైరెక్టర్‌గా ఉన్నారు. తాజా బదిలీల్లో ఏలూరు జిల్లా కలెక్టర్‌గా నియమితులయ్యారు. కలెక్టర్ వెట్రిసెల్వి బుధవారం ఉదయం జిల్లాకు చేరుకుంటారు. కలెక్టరేట్‌లో ఉదయం 9.30 గంటలకు కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరిం చనున్నారు.

బాధ్యతల నుండి రిలీవ్ అయిన ప్రసన్న వెంకటేష్

జిల్లా కలెక్టర్ బాధ్యతల నుంచి ప్రసన్న వెంకటేష్ మంగళవారం రిలీవ్ అయ్యారు. జిల్లాలో విధి నిర్వహణపరంగా రెండున్నరేళ్ల కాలం తనకు ఎంతో సంతృప్తినిచ్చిందని ఆయన తెలిపారు. తనకు సహకరించిన అధికారులకు, ప్రజలకు సంస్థలకు ధన్యవాదాలు తెలిపారు.

నీట్ రద్దు కోరుతూ ర్యాలీ, ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్




ధర్నా చేస్తున్న పిడిఎస్‌యు నాయకులు

నీట్ 2024 పరీక్షను రద్దు చేయాలని కోరుతూ పిడిఎస్‌యు ఆధ్వర్యంలో మంగళవారం ఏలూరు జెడ్‌పి కార్యాలయం నుంచి ఫైర్ స్టేషన్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి, అనంతరం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షుడు కాకి నాని మాట్లాడుతూ 13 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన విషయంపై ఇప్పటివరకు ప్రధాని నరేంద్ర మోడీ కనీసం మాట్లాడకపోవడం బాధ్యతారాహిత్యమని అన్నారు. ప్రజల ఓట్లు కావాలి తప్ప ప్రజల సమస్యలపై స్పందించరా అని ప్రశ్నించారు. నీట్ పరీక్ష నిర్వహణ పర్యవేక్షణలో విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పూర్తిగా విఫలమయ్యారని, ఆయన వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పిడిఎస్‌యు నగర అధ్యక్షుడు ఎం.క్రాంతి మాట్లాడుతూ పరీక్ష పేపర్‌ను రూ.30 లక్షలకు అమ్ముకున్నామని దోషులు ఒప్పుకున్నా చర్యలు లేకపోవడం దారుణమన్నారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లోనే ఎక్కువగా పేపర్ లీకేజీలు జరగడం ఆలోచించాల్సిన విషయమన్నారు. 2024 నీట్ రద్దుచేసి మళ్లీ నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో ఎం.చందన్. సిహెచ్.యశ్వంత్, ఆర్.రేవంత్ తదితర విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

చింతలపూడి ఎంఎల్‌ఎ రోషన్‌కుమార్‌కు సిపిఎం బృందం వినతి



ఎంఎల్‌ఎ రోషన్‌కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న సిపిఎం నేత రవి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

చింతలపూడి నియోజకవర్గంలో సమస్యలు పరిష్కరించాలని ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్‌ను సిపిఎం జిల్లా బృందం కోరింది. సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, ఆ నియోజకవర్గ నేతలతో కూడిన బృందం మంగళవారం పట్టణంలోని గరల్స్ హైస్కూల్లో కార్యక్రమానికి విచ్చేసిన ఎంఎల్‌ఎ రోషన్‌కుమార్‌ను కలిసింది. నియోజకవర్గంలోని పలు సమస్యలపై వినతిపత్రం ఇచ్చి మాట్లాడారు. ఎర్ర కాలువ రిజర్వాయర్ మిగులు భూములు స్థానిక పేదలకు సాగుకు ఇవ్వాలని, నియోజకవర్గంలో ల్యాండ్ సీలింగ్ భూములు పేదలకు, దళితులకు పంచాలని కోరారు. సాగులో ఉన్న వారికి పట్టాలివ్వాలని, చింతలపూడి ఎత్తిపోతల పథకం పనులు పూర్తిచేసి రైతులకు మార్కెట్ ధరకు అనుగుణంగా పరిహారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. చింతలపూడిలో బస్ డిపో ఏర్పాటు చేయాలన్నారు. చింతలపూడి, జంగారెడ్డిగూడెంల్లో రోడ్లు, డ్రెయిన్ల సమస్యలు పరిష్కరించాలని కోరారు. పట్టెన్నపాలెం వంతెన నిర్మాణం పూర్తి చేయాలని, జంగారెడ్డిగూడెంలోని పంగిడిగూడెం రోడ్లో పిహెచ్‌సికి కాంపౌండ్ వాల్ కట్టి తిరిగి ప్రారంభించాలని, జంగారెడ్డిగూడెం, చింతలపూడి ఆసుపత్రుల్లో ఖాళీ వైద్యుల పోస్టులు భర్తీ చేయించాలని విజ్ఞప్తి చేశారు. అవసరమైన వైద్య పరికరాలు, మందులు అందుబాటులో ఉంచాలన్నారు. భోగోలు అటవీ భూములు, చింతలపూడి నియోజకవర్గంలో అసైన్డ్, సీలింగ్ భూములు దళితులకు, పేదలకు పంచాలని కోరారు. దీనిపై ఎంఎల్‌ఎ రోషన్‌కుమార్ స్పందిస్తూ ఈ సమస్యలన్నింటిపై అధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తానని ఎంఎల్‌ఎ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి ఎం.జీవరత్నం, పట్టణ కన్వీనర్ పి.సూర్యారావు, చింతలపూడి మండల కన్వీనర్ ఆర్‌విఎస్.నారాయణ, నేతలు జి.సూర్యచంద్రం, జి.సూర్యకిరణ్, అందుగుల ప్రభాకర్‌రావు, వై.సీత, వి.గోపీ తదితరులు పాల్గొన్నారు.

రద్దు చేసిన రైళ్లను పునరుద్ధరించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రైల్వే స్టేషన్లు, రైల్వే ట్రాక్, సిగ్నలింగ్ వ్యవస్థ ఆధునీకరణ పేరుతో విజయవాడ నుంచి విశాఖపట్నం వెళ్లే రూట్లో పలు రైళ్లను రద్దు చేయడంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలకు గురవుతున్నారని, రైల్వే శాఖాధికారులు స్పందించి పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేసి రద్దు చేసిన రైళ్లను పునరుద్ధరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. విజయవాడ నుంచి విశాఖపట్నం వెళ్లే రూట్లో విజయవాడ నుంచి వయా ఏలూరు, తాడేపల్లిగూడెం మీదుగా కాకినాడ వెళ్లే రూట్లో పలు రైళ్లు రద్దు చేయడంతో ప్రతిరోజు రాకపోకలు సాగించే ఉద్యోగులు, విద్యార్థులు అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయన్నారు. తాడేపల్లిగూడెం, నిడదవోలు, కొవ్వూరు, రాజమండ్రి, సామర్లకోట, కాకినాడ ప్రాంతాలకు వెళ్లేవాళ్లు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైలు ప్రయాణానికి బస్సు ప్రయాణానికి అయ్యే ఖర్చులో వ్యత్యాసం ఎక్కువగా ఉండడంతో ప్రయాణికుల ఇబ్బందుల్లో ఒక భాగమని తెలిపారు. రైల్వే అధికారులు, ప్రభుత్వం స్పందించి పేదలు, సామాన్య ప్రజలు, ఉద్యోగులు, విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని రద్దయిన రైళ్లను పునరుద్ధరించాలని, రైళ్లలో జనరల్ బోగీలు ఎక్కువగా కేటాయించాలని కోరారు.

1 నుంచి స్టాప్ డయేరియా క్యాంపెయిన్

రెండు నెలల పాటు నిర్వహణ

జిల్లా ఇమ్యూనైషన్ అధికారి నాగేశ్వరరావు

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

అతిసార నివారణ ప్రచార కార్యక్రమాన్ని (స్టాప్ డయేరియా కాంపెయిన్) పెద్ద ఎత్తున నిర్వహించనున్నట్లు జిల్లా ఇమ్యూనైషన్ అధికారి డాక్టర్ నాగేశ్వరరావు తెలిపారు. అతిసార నివారణ ప్రచార కార్యక్రమాన్ని జూలై ఒకటో తేదీ నుంచి ఆగష్టు 31వ తేదీ వరకు రెండు నెలల పాటు నిర్వహించాలని ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయని ఆయన చెప్పారు. ఈ మేరకు నిర్వహించిన జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం జూమ్ కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. విద్యా, వైద్య ఆరోగ్య శాఖ, మహిళా శిశుసంక్షేమ శాఖ, తాగునీరు పారిశుధ్య శాఖ, పట్టణ అభివృద్ధి, పంచాయతీ, గ్రామీణ అభివృద్ధి శాఖలు సమన్వయంతో పని చేయాలన్నారు. ప్రతివారం చేపట్టాల్సిన పనులపై స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక ఉండాలని ఆయన స్పష్టం చేశారు. పారిశుధ్య డ్రైవ్‌లు నిర్వహించి అతిసార ప్రబలేందుకు అవకాశం ఉన్న స్థలాలను గుర్తించి అచ్చట ఉన్న చెత్తను శుభ్రం చేయాలని, మురుగు నీరు నిల్వ లేకుండా చూడాలని, పూడికలు తొలగించడం, ముఖ్యంగా మార్కెట్‌లు, ఆహార పదార్థాలు విక్రయించే స్థలాలు, మురికివాడలు, తాత్కాలిక నివాసాల వద్ద దృష్టి సారించాలని సూచించారు. చెత్త సేకరణ, వాటి రవాణాపై ప్రత్యేక శ్రద్ధతో చర్యలు చేపట్టాలని, వర్షాకాలంలో మరిన్ని చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రజా మరుగుదొడ్లను నిరంతరం శుభ్రపరచాలని, అతి ప్రమాదకర స్థాయిలో ఉన్న ప్రాంతాలపై దృష్టి సారించాలని ఆయన చెప్పారు. అన్ని తాగునీటి పథకాలపై దృష్టి సారించాలని, సమయానుసారంగా క్లోరినేషన్ చేయాలని, తాగు నీటి పరీక్షలు నిర్వహించాలని సూచించారు. బావులు, బోరు బావులు, కుళాయిలను తక్షణం తనిఖీ చేయాలని ఆయన ఆదేశించారు. తాగు నీరు కలుషితం కావడం వల్ల అతిసార ప్రబలేందుకు ఎక్కువ అవకాశాలు ఉంటాయని, పర్యవేక్షించాలని ఆయన స్పష్టం చేశారు. ఇంజినీరింగ్ సహాయకులు నీటి వసతుల నుంచి కుళాయి వరకు పూర్తిస్థాయిలో తనిఖీ చేయాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో తాగునీరు, మరుగుదొడ్లను తనిఖీ చేసి ఎటువంటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి అంగన్వాడీ కేంద్రంలో, పాఠశాలల్లో చేతుల శుభ్రతపై చిన్నారులకు శిక్షణ ఇవ్వాలని సూచించారు. తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించాలని అందులో చేతులు శుభ్రత, వ్యక్తిగత పారిశుధ్యంపై విధిగా చర్చించాలని చెప్పారు. ఐదేళ్ల లోపు చిన్నారుల జాబితా సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ఓఆర్‌ఎస్, జింక్ టాబ్లెట్లు, ఐవి ఫ్లూయిడ్స్ సిద్ధంగా ఉంచాలని, తద్వారా అనుకోని పరిస్థితుల్లో ఉపయోగపడతాయని చెప్పారు. చిన్నారులకు టీకా కార్యక్రమం పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఇ ఎన్.సత్యనారాయణ, జిల్లా గ్రామ పంచాయతీ అధికారి విశ్వనాథ్ శ్రీనివాస్, జిల్లా విద్యా శాఖాధికారి అబ్రహం, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి పద్మావతి పాల్గొన్నారు.

నేటి నుంచి 'ప్రత్యేక పారిశుధ్య పరిరక్షణ'

29వ తేదీ వరకు కార్యక్రమాలు నిర్వహణ

పంచాయతీ విస్తరణాధికారి సుందరి

ప్రజాశక్తి - భీమడోలు



మురుగు కాలవల పరిశుభ్రత కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న పంచాయతీ విస్తరణ అధికారి

మండల పరిధిలోని అన్ని గ్రామపంచాయతీల్లో ఈ నెల 26వ తేదీ నుంచి 29వ తేదీ వరకు నాలుగు రోజులపాటు ప్రత్యేక పారిశుధ్య పరిరక్షణ కార్యక్రమాలను చేపట్టనున్నట్లు పంచాయతీ విస్తరణాధికారి సుందరి తెలిపారు. సన్నాహక చర్యల్లో భాగంగా పంచాయతీ విస్తరణ అధికారి మంగళవారం కొన్ని గ్రామపంచాయతీలను సందర్శించారు. అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ విస్తరణాధికారి మాట్లాడుతూ ప్రతి గ్రామపంచాయతీలో ప్రత్యేక పారిశుధ్య పరిరక్షణ కార్యక్రమాల నిర్వహణలో భాగంగా రక్షిత మంచినీటి పథకం ట్యాంకులను శుభ్రం చేయాలని, క్లోరినేషన్, ఇతర కార్యక్రమాలు చేపట్టాలన్నారు. తాగునీటి పైపుల లీకేజీలు అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. వాతావరణ పరిస్థితుల కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున పంచాయతీ సిబ్బంది ముందస్తు జాగ్రత్త చర్యలను అమలు చేయాలని కోరారు. ఈ మేరకు వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బంది సహకారంతో తీసుకోవాలన్నారు. ఇదే క్రమంలో పరిసరాల పరిశుభ్రత పాటించాలని కోరారు. ప్రతిఒక్కరూ కాచి చల్లార్చిన నీరు తాగాలని, ఈ మేరకు ప్రజలు అవగాహన కల్పించాలని పంచాయతీ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల పిల్లల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. వసతి గృహాలు, తినుబండారాల షాపుల్లో ఉన్న పదార్థాలపై ఈగలు, దోమలు వాలకుండా జాగ్రత్తగా తీసుకోవాలన్నారు. చేతుల పరిశుభ్రత, దాన్ని అమలు చేయడం విషయమై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, నీటి నిల్వలు లేకుండా చూడడంతో పాటు, మురుగు కాలువల ద్వారా పారే నీటి ప్రవాహాలను క్రమబద్ధీకరించాలన్నారు.

ఏలూరును భిక్షాటన లేని జిల్లాగా తీర్చిదిద్దాలి


బాలల సంరక్షణ అధికారి సిహెచ్.సూర్యచక్రవేణి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

బాలలతో భిక్షాటన చేయిస్తూ ఉన్నవారిని గుర్తిస్తే వెంటనే వారి సమాచారాన్ని జిల్లా బాలల సంరక్షణ అధికారికి గానీ దగ్గరలోని పోలీసు స్టేషన్‌లో అందించాలని బాలల సంరక్షణ అధికారి డాక్టర్ సిహెచ్.సూర్యచక్రవేణి తెలిపారు. స్థానిక ఆర్ఆర్.పేట, పత్తేబాదలో నెలల వయస్సు కలిగిన బాలునితో భిక్షాటన చేస్తున్న తల్లిని చైల్డ్ హెల్ప్ లైన్-1098 సిబ్బంది ద్వారా గుర్తించి డిసిపియు కార్యాలయానికి తీసుకొచ్చి మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. వీరు పెదవేగి మండలం సూర్యపేట గ్రామానికి చెందిన వారని, భిక్షాటన చేసుకుంటూ జీవనం సాగిస్తునారని, ఇది వారి కుల వృత్తిగా భావిస్తున్నారన్నారు. ఇది చట్ట వ్యతిరేకమైన పని అని, ఇలాగే కొనసాగితే చట్టపరంగా చర్యలు చేపతామని, ఎవరైనా చిన్నారులతో భిక్షాటన చేయిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎక్కడైనా బాలలు భిక్షాటన చేస్తే వారికి నగదు బదులు, వారికి కావల్సిన ఆహారం, వస్తువులు లేదా వసతి కల్పించడానికి ప్రయత్నించాలని, భిక్షాటన లేని జిల్లాగా తీర్చిదిద్దటానికి ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. పిల్లలందరూ బడిలో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇకపై ఎవరైనా రోడ్ల మీదకు అడుక్కోవటానికి వస్తే కేసులు బుక్ చేసి ఎఫ్ఐఆర్ చేయించి రిమాండుకు పంపిస్తామని హెచ్చరించారు.



మహిళకు కౌన్సెలింగ్ ఇస్తున్న సూర్యచక్రవేణి



తాగునీరు పట్టుకుంటున్న వడాలి గ్రామస్తులు

వడాలి గ్రామస్తులకు తాగునీటి సరఫరా

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని వడాలి గ్రామస్తులకు పంచాయతీ ఆధ్వర్యంలో తాగునీటిని ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నారు. ఈ నెల 21వ తేదీన గ్రామస్తులు తాగునీటి సమస్యపై రాస్తారోకో చేసిన విషయం పాఠకులకు తెలిసిందే. గ్రామంలోని తాగునీటి కుళాయిల ద్వారా సరఫరా చేస్తున్న నీరు తాగేందుకు ఏమాత్రం ఉపయోగంగా లేదని, ఈ నీటిని వినియోగించిన ప్రజలకు అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని నిరసిస్తూ ముదినేపల్లి - బంటుమిల్లి రహదారిపై గ్రామస్తులు రాస్తారోకో చేశారు. దీనిపై స్పందించిన ఎంపిడిఒ ఎన్.మురళీ గంగాధరరావు, ఇఒపిఆర్‌డి దూలం లక్ష్మీనారాయణ తాగునీటి సమస్య పరిష్కరించేందుకు వాటర్ ట్యాంకర్ల ద్వారా గ్రామంలో గత నాలుగు రోజులుగా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. హై స్కూల్ రోడ్డు నుంచి ఎస్‌టి కాలనీ వరకు ఉన్న నివాసితులకు ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి జి.రమేష్ తెలిపారు.

తాగునీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ పరీక్షలు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి



పరీక్షలు చేస్తున్న సిబ్బంది

వర్షాకాలం ప్రారంభమైనందున మండలంలోని తాగునీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ పరీక్షలు జరుపుతున్నట్లు గ్రామీణ నీటి పారుదల శాఖ ఎఇ వినయ్‌కుమార్ తెలిపారు. మండలంలోని లక్ష్మీపురం, స్వర్ణవారిగూడెంలో ఉన్న ట్యాంకులను ఆయన మంగళవారం పరిశీలించి సిబ్బందితో క్లోరినేషన్ చేయించినట్లు తెలిపారు. వర్షాకాల సమయం కావడంతో వర్షపు నీరు చేరి, పలు రకాల వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ట్యాంకులను ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేసుకోవడం వల్ల నీరు కలుషితం కాకుండా ఉండేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. అదేవిధంగా ఎప్పటికప్పుడు క్లోరినేషన్ పరీక్షలు జరపనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, కస్తూరి, సువర్ణ, కావేరి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా డిఇఎల్ఇడి పరీక్ష

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

డిఇఎల్ఇడి నాలుగో సెమిస్టర్ పరీక్షలు రెండో రోజు మంగళవారం ప్రశాంతంగా జరిగాయి. మంగళవారం జరిగిన పరీక్షలో 67 మంది విద్యార్థులకు 67 మంది విద్యార్థులు హాజరయ్యారని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఎక్కడ కూడా ఎటువంటి మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు కాలేదని

మంత్రి నిమ్మలను కలిసిన పశ్చిమ కలెక్టర్ నాగరాణి

జిల్లాకు చెందిన రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడును అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో జిల్లాకు కలెక్టర్‌గా నూతనంగా నియమితులైన చదలవాడ నాగరాణి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ జిల్లాను అభివృద్ధి పథంలో నడిపేలా ముందుకు సాగాలని సూచించారు. పెండింగ్ పనులపై ప్రధానంగా దృష్టి సారించాలని, ప్రభుత్వ పథకాలకు ప్రజలకు చేరువ చేయాలని అన్నారు.



భీమవరంలో కల్కి సందడి షురూ

భీమవరం టౌన్: ప్రభాస్ హీరోగా నటించిన కల్కి సినిమా సందడి భీమవరంలో షురూ అయ్యింది. ఈ నెల 27న విడుదలవుతున్న కల్కి సినిమాకు సంబంధించి అభిమానులు ఇప్పటికే భారీస్థాయిలో ఫ్లెక్సీలు, కటౌట్లు ఏర్పాటు చేశారు. మంగళవారం భీమవరంలోని యూత్ క్లబ్ రోడ్డులో అభిమానులు 17 కార్లతో కల్కి (ఇంగ్లీష్ అక్షరాలు) రూపంలో ఏర్పాటు చేసి అందర్నీ ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్ల ర్యాలీతో పట్టణంలో సందడి వాతావరణం నెలకొంది.


యుటిఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో నాయకులు

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో యుటిఎఫ్ ఎప్పుడూ ముందుంటుందని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ తెలిపారు. ఉంగుటూరు మండల యుటిఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం యుటిఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పునుమల రాంబాబు, దాకి జోగినాయుడు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. రవికుమార్ కైకరం హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు గుళ్ల ప్రసాదరావుతో సభ్యత్వ నమోదు ప్రారంభించారు. ఈ సందర్భంగా రవికుమార్, గౌరవ అధ్యక్షులు శీతల సత్యనారాయణ మాట్లాడుతూ యుటిఎఫ్‌లో చేరి సంఘాన్ని బలపర్చాలని కోరారు. ఉపాధ్యాయుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీధర్, జిల్లా కార్యవర్గ సభ్యులు అల్లు క్రిష్, కోశాధికారి ఆనంద్ కుమార్, పుప్పాల నరసింహరావు, బొమ్మిడి ప్రసాద్, వెంకటేష్ పాల్గొన్నారు.

కచ్చా డ్రెయిన్ మరమ్మతులకు చర్యలు

ప్రజాశక్తి - మండవల్లి


డ్రెయిన్‌లో మట్టి తొలగిస్తున్న సిబ్బంది

వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని కానుకొల్లు పంచాయతీ పరిధిలో కచ్చా డ్రెయిన్ మరమ్మతులకు చర్యలు చేపట్టామని కానుకొల్లు సర్పంచి నాగ దాసి థామస్ తెలిపారు. కచ్చా డ్రెయిన్‌లో మురుగు ప్రవాహానికి అడ్డుగా ఉన్న మట్టిని మంగళవారం సిబ్బందితో తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కచ్చా డ్రెయిన్లు మట్టితో చెత్తతో నిండిపోయాయన్నారు. దీంతో వర్షం కురిస్తే మురుగునీరు పోయేందుకు మట్టి అడ్డుపడడంతో రహదారుల పైకి మురుగుతోపాటు వర్షపునీరు చేరుకుని అంతర్గత రహదారులను ముంచెత్తే ప్రమాదం ఉందన్నారు. వ్యాధులు కూడా ప్రబలే అవకాశం ఉందన్నారు. అందువల్ల ముందుగానే వర్షాకాలం దృష్టిలో పెట్టుకుని కచ్చా డ్రెయిన్లలో పెరిగిపోయిన మట్టిని సిబ్బందిని ఏర్పాటు చేసి తొలగిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి ఎస్‌వి.రాధిక, సిబ్బంది పాల్గొన్నారు.

అధిక ధరలు.. పేదలు బెంబేలు

భారీగా పెరిగిన కూరగాయల ధర
అధికంగా మాంసం రేట్లు
పౌష్టికాహారానికి సామాన్యులు దూరం

ప్రజాశక్తి - ముసునూరు



బాలబాలికలకు, బాలింతలకు, గర్భిణులకు పౌష్టికాహారంగా కూరగాయలతో పాటు మాంస కృత్తులైన చికెన్, చేప, మటన్, కోడిగుడ్లు ఇలా పలు రకాల ఆహారాలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తుంటారు. కాని అవి మార్కెట్‌లో కొనుగోలు చేసే పరిస్థితి కనిపించడం లేదు. పేదలు, మధ్యతరగతి, దిగువతరగతి ప్రజలను భయపెట్టే రీతిలో ధరలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. మటన్ వంటి మాంసాహారం తినాలంటే కోనే పరిస్థితి లేదని రోజు వారి కూలీ పని చేసుకునే సామాన్య ప్రజానీకం ఆవేదన చెందుతున్నారు. మార్కెట్‌లో ఉన్న ఆ ధరలు చూసి భయభ్రాంతులకు గురవుతున్నారు. ఒకప్పటి ఉద్యోగులు చేసుకునే మధ్యతరగతి ప్రజలు సైతం కొన్ని సందర్భాల్లో తాము కొనే పరిస్థితి లేదంటున్నారు. మటన్ ధరలు కేజీ రూ.700 నుంచి, రూ.800, రూ.900 ఇలా రోజురోజుకు పెరుగుతూ పోతుంది. చికెన్ ఒక్కో సమయంలో ఒక్కో ధర బోర్డుపై కనిపిస్తుంది. చేపల ధరలు కూడా ఒక్కోక్క వారం ఒక్కోలా పెరగడంతో పేదలు వాటికి దూరంగా ఉంటున్నారు. చేపల మార్కెట్లలో ధరకు అనుగుణంగా కొన్నా సరే తూకంలో తేడాలు కనిపిస్తుందని వాపోతున్నారు. కోడిగుడ్లు విషయానికొస్తే ఒక్కోక్క కోడిగుడ్డు రూ.6, రూ.6.50, రూ.7 కూడా అమ్మకాలు జరుగుతున్నాయని, అదే నాటు కోడి గుడ్డు అయితే రూ.20 నుంచి రూ.30 పెరిగినట్లు వ్యాపారులు చెబుతున్నారు.

కొన్ని ఏరియాల్లో చేపల చెరువులు మళ్లీ పునరావృత్తం చేయడానికి నీళ్లు తీసివేసి, మళ్లీ నూతనంగా నిర్మించి చేపల పెంపకం చేపట్టే సమయం కావడంతో ధరలు పెరుగుతున్నాయంటూ చేపల వ్యాపారులు చెబుతున్నారు. కూరగాయల ధరల విషయానికొస్తే ఎండాకాలం పోయి వర్షాకాలంవచ్చే సీజన్‌లో ధరలు పెరగడం సహజం. కాని మరీ ఇంతా ఆమతంగా పెరగడం దారుణమంటున్నారు. టమాట, పచ్చిమిర్చి, ఉల్లి, దుంపల ధరలు మే నెలలో రూ.30 నుంచి రూ.40 ఉంటే నేడు ఆ పరిస్థితి లేదు. రూ.90 నుంచి రూ.100కు చేరిందని, ఆదేమంటే పంట ఉత్పత్తి తగ్గిందని, రవాణా ఛార్జీలు పెరిగాయని, దీంతో ధరలు పెరుగుతున్నాయని సామాన్య ప్రజలపై ధరల ప్రభావం చూపుతున్నారు. ఆదివారం, పండుగ వంటి సందర్భాల్లో చికెన్, మటన్, చేపలు తినే పరిస్థితి లేదని, మొత్తంగా పెరిగిన ధరలతో పేద, మధ్య తరగతి, సామాన్య ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఇప్పటికైనా నూతన ప్రభుత్వం ధరలపై చర్యలు తీసుకుంటేనే ప్రజలంతా పౌష్టికాహారం తీసుకోగలరని, లేకుంటే ఆకలితో భోజనాలతో సరిపెట్టుకోవాల్సిందేనని సామాన్యులు నిట్టూరుస్తున్నారు.

నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తా

చింతలపూడి ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్


పాఠశాలలో నేను బడికి పోతా కార్యక్రమంలో సొంగా రోషన్‌కుమార్

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని చింతలపూడి ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. మంగళవారం ఆయన జంగారెడ్డిగూడెంలో పర్యటించారు. జంగారెడ్డిగూడెం హైస్కూల్ ప్లస్ బాలుర, బాలికల పాఠశాలల్లో నేను బడికి పోతా కార్యక్రమంలో పాల్గొన్న ఆయన విద్యార్థులకు కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు తప్పకుండా అందిపుచ్చుకోవాలన్నారు. బాగా చదివి ఉన్నత స్థానాల్లో నిలవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారుస్తానన్నారు. విద్యార్థులకు అన్ని వసతులు కల్పిస్తామన్నారు. మంత్రి నారా లోకేష్ విద్యావ్యవస్థను బలపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నారన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రిని పరిశీలించారు. ఆసుపత్రిలో అన్ని విభాగాలను పరిశీలించిన ఆయన అందుతున్న వైద్య సేవల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని సూచించారు. అనంతరం జంగారెడ్డిగూడెం మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేత


ఏలూరు సిటీ : పుస్తకాలు అందిస్తున్న బడేటి చంటి


ప్రజాశక్తి - ఏలూరు సిటీ

తూర్పు వీధిలోని తొమ్మిదో డివిజన్ పిచ్చుక గుంట ఏరియాలో ఉన్న విఠలేశ్వర ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి రెడ్డి అప్పలనాయుడు పుస్తకాలు పంపిణీ చేశారు. తనను కలిసేందుకు వచ్చేవారంతా బొకేలు, శాలువాలు వంటివి కాకుండా విద్యార్థులకు ఉపయోగపడే నోటు పుస్తకాలను తీసుకురావాలని ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి పిలుపునిచ్చారు. ఆయనను కలిసేందుకు వస్తున్న పలువురు నాయకులు, కార్యకర్తలు నోటు పుస్తకా లను తీసుకొస్తున్నారు. అలా వచ్చిన పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేస్తున్నారు. తాజాగా ఏలూరులోని తొమ్మిదో డివిజన్ పరిధిలో ఉన్న తూర్పు వీధిలోని పిచ్చుకగుంట ఏరియాలో విఠలేశ్వర ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం నోటు పుస్తకాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఎతో పాటు జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి రెడ్డి అప్పలనాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం శుభపరిణామమన్నారు. ఈ కార్యక్రమంలో తొమ్మిదో డివిజన్ క్లస్టర్ ఇన్‌ఛార్జి ఓబిలిశెట్టి శ్రావణ్ కుమార్ గుప్తా, డివిజన్ ఇన్‌ఛార్జి కీర్తి కృష్ణనాయుడు పాల్గొన్నారు.


మండవల్లి : పుస్తకాలు అందిస్తున్న కోటేశ్వరరావు, దుర్గాప్రసాద్

మండవల్లి : ప్రభుత్వ పాఠశాలలో అందుతున్న సౌకర్యాలను అందిపుచ్చుకుని విద్యలో రాణించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని భైరవపట్నానికి చెందిన ప్రముఖులు చాపరాల దుర్గాప్రసాద్ అన్నారు. ఉనికిలి ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు చలసాని కోటేశ్వరరావు (కోటయ్య) ఆర్థిక సహాయంతో అందిస్తున్న పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విలువలతో కూడిన విద్య అందుతుందన్నారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు చేరుకుని విద్యను అభ్యసిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. అనంతరం నోటు పుస్తకాలు, పెన్నులు, ఇతర సామగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు తోట మాధవి, తమ్మినేని వెంకటేశ్వరరావు, జాజుల చింతారావు, తోట శేషయ్య, కొడాలి వెంకటేశ్వరరావు, గుడివాడ గణేష్, వీరబల్లి శివయ్య, కొలిపే సువర్ణ, మేరీ పుష్పం, మేరీ రాజబాబు, దాసరి మహేంద్ర, కొలిపే వందనం, నాగులపల్లి వీరబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చింతలపూడి : విద్యాశాఖ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన నారా లోకేష్ రానున్న రోజుల్లో విద్యార్థులకు మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేయనున్నారని టిడిపి చింతలపూడి నగర పంచాయతీ అధ్యక్షులు పక్కాల వెంకటేశ్వరరావు, ఐటిడిపి చింతలపూడి నియోజకవర్గ అధ్యక్షులు బోడా అనీష్ కుమార్ అన్నారు. పాత చింతలపూడి గ్రామంలోని పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు హేమలత ఆధ్వర్యంలో టౌన్ ప్రధాన కార్యదర్శి బోడ నాగభూషణం, బోడా అనీష్ కుమార్ అధ్యక్షతన విద్యార్థులకు మంగళవారం కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సహచర ఉపాధ్యాయులు కూసం దామోదర్, కర్లపూడి రాజారత్నం, మన్యం సత్తిబాబు, తాటి అప్పారావు, తిరుమిల్లి రామారావు, జనసేన జిల్లా సంయుక్త కార్యదర్శి తూము విజయ్, ఎ.అప్పారావు, బిజెపి జిల్లా మహిళా మోర్చా నాయకురాలు విజయ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


చింతలపూడిలో...



ఆగిరిపల్లిలో...

ఆగిరిపల్లి : దాతలు అందించిన సహాయ, సహకారాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, తోటపల్లి ప్రీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు టి.శోభన్‌బాబు అన్నారు. తోటపల్లి ప్రీ హైస్కూల్ విద్యార్థులకు గ్రామ ప్రముఖులు ఎంఎల్‌ఎస్‌ఆర్‌కె.ప్రసాద్ దంపతులు రూ.15 వేల విలువైన నోటు పుస్తకాలు, పలకలు, పెన్నులను ఉచితంగా అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి, ఆరేపల్లి శ్రీపద్మ, తోటపల్లి మాజీ సర్పంచి, నియోజకవర్గ బిసి సెల్ అధ్యక్షులు ఆరేపల్లి శ్రీనివాసరావు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

బాలికపై అత్యాచారం కేసులో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి - ముదినేపల్లి

బాలికపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ డిఎస్‌పి ఎన్.మురళీకృష్ణ తెలిపారు. ముదినేపల్లి పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో నిందితుడిని హాజరు పరిచారు. డిఎస్‌పి మురళీకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని ఓ గ్రామంలో ఒక మహిళ భర్త చనిపోవడంతో హైదరాబాద్‌కి చెందిన ముక్కవరపు ఉదయ్ కుమార్(41)తో కొంతకాలంగా సహజీవనం చేస్తుంది. ఉదయ్‌కుమార్ హైదరాబాదు నుంచి తరచూ ఆమె వద్దకు వచ్చి వెళ్తున్నాడు. ఆమెకు పదేళ్ల కుమార్తె, ఏడేళ్ల కుమారుడు ఉన్నారు. గత నెల 19వ తేదీ అర్ధరాత్రి ఆమె కుమార్తెపై ఉదయ్ కుమార్ అత్యాచారానికి పాల్పడ్డాడు. బాలిక కేకలు వేయటంతో నిద్రలేచిన ఆమె తల్లి అడ్డుకుంది. అయితే అప్పటికే ఆమెకు ఉదయ్ కుమార్ రూ.2.20 లక్షలు ఇవ్వాల్సి ఉండడంతో ఈ విషయం ఎవరికైనా చెబితే ఆ నగదు ఇవ్వనని, చంపేస్తానని బెదిరించాడు. దీంతో ఆ మహిళ ఈ విషయాన్ని గ్రామానికి చెందిన నలుగురు నాయకులకు, ఒక మహిళకు చెప్పింది. దీంతో వారు రాజీ చేసుకోవాల్సిందిగా ఆమెకు తెలిపారు. ఈ నేపథ్యంలో ఈనెల 16వ తేదీన ఆ నలుగురు గ్రామపెద్దలు, మహిళ వచ్చి రూ.2.20 లక్షలు ఉదయ్ కుమార్ ఇచ్చేస్తాడని, కేసు ఏమి పెట్టనని తెల్ల కాగితంపై సంతకం చేయాలని కోరారు. దానికి మహిళ నిరాకరించడంతో ఆ నలుగురు వ్యక్తులు కుర్చీలతో కొట్టి గాయపరిచారు. దీంతో ఆమె ఈనెల 20వ తేదీ జరిగిన విషయంపై ముదినేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ డిఎస్‌పి నున్న మురళీకృష్ణ గ్రామంలో విచారించి వివరాలు సేకరించారు. అనంతరం బాలికపై అత్యాచారానికి పాల్పడిన ఉదయ్‌కుమార్‌ను మంగళవారం అరెస్ట్ చేసి కైకలూరు కోర్టుకు హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడు ముక్కవరపు ఉదయ్ కుమార్ ద్వారకాతిరుమల మండలం పి.కన్నాపురం గ్రామానికి చెందినవాడు. ఈ సమావేశంలో ఎస్‌డిపిఒ ఇ.శ్రీనివాసులు, కైకలూరు సిఐ కృష్ణకుమార్, ఎస్‌ఐ డి.వెంకట్ కుమార్ పాల్గొన్నారు.

దాడి చేసిన యువతి అరెస్ట్

ప్రజాశక్తి - చాట్రాయి

ఏడాది క్రితం మండలంలోని చిత్తపూరు గ్రామానికి చెందిన ఆడిమిల్లి నరేష్, జుంజునూరి ప్రియాంక ఇరువురికి పంచాయతీ మంచినీటి బోరు దగ్గర గొడవ జరిగింది. ఈ క్రమంలో ఈ నెల నాలుగో తేదీన ఎన్నికల కౌంటింగ్ రోజున వారి ఇరువురి మధ్య గొడవ జరిగింది. ఇద్దరు వేర్వేరే పార్టీలు కావడంతో ఇరువురి మధ్య గొడవ జరిగింది. తనపై ప్రియాంకతో పాటు ఆమె అనుచరులు ఐదుగురు కలిసి దాడి చేశారని నరేష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు ఐదుగురిని అరెస్టు చేసి ప్రియాంకను అరెస్టు చేయకపోవడంతో చాట్రాయి పోలీస్‌స్టేషన్ వద్ద మహిళలు సోమవారం ఆందోళన చేశారు. జుంజునూరి ప్రియాంకను పోలీసులు మంగళవారం అరెస్టు చేసినట్లు చాట్రాయి ఎస్‌ఐ కెసిహెచ్.స్వామి తెలిపారు.

ఎంఎల్‌ఎ బడేటి చంటికి ఎస్‌టి ఉద్యోగుల సంఘం సన్మానం

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

అఖిల భారత ఆదివాసీ ఉద్యోగుల సంఘం 965/2019 తరపున ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి (రాధాకృష్ణయ్య)ను సోమవారం సాయంత్రం సంఘం నాయకులు, సభ్యులు శాలువాలతో, పుష్పగుచ్ఛాలతో, పుష్పమాలలతో ఘనంగా సన్మానించారు. సంఘం జాతీయ అధ్యక్షులచే సంకలనం చేసిన ప్రతి విద్యార్థి ఇంట భారత రాజ్యాంగం అనే ద్విభాష రాజ్యాంగ పుస్తకాన్ని ఎంఎల్‌ఎకు బహూకరించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ బడేటి చంటి మాట్లాడుతూ ఎస్‌టి అధికారులు ఉద్యోగులతో పాటు ఆదివాసీ గిరిజన సామాన్య ప్రజలందరికీ నిరంతరం అందుబాటులో ఉంటూ వారి సంక్షేమం, అభివృద్ధి, వారి రక్షణ కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సంఘం జాతీయ అధ్యక్షులు డాక్టర్ దేవరకొండ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సంఘం లక్ష్యాలను సంక్షిప్తంగా తెలియజేశారు. సిఎంను, మంత్రులను, ఎంపీలను, ఎంఎల్‌ఎలను అభినందించి శుభాకాంక్షలు తెలిపేందుకు మాత్రమే విచ్చేశామని సమస్యలను రానున్న కాలంలో సమర్పిస్తామని చెప్పారు. ఎస్‌టి అధికారులు, ఉద్యోగులందరం కలిసి చిత్తశుద్ధితో, అంకిత భావంతో, నీతి, నిజాయితీలతో పనిచేసి రాష్ట్ర అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తామని ఎంఎల్‌ఎకు తెలిపారు. అనంతరం సిఎం చంద్రబాబును, మంత్రు లను, ఎంపీలను, ఎంఎల్‌ఎలను అభినం దిస్తూ శుభాకాంక్షలు తెలిపినట్లు సంఘం తరపున ఒక లేఖను అందించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు నియోజకవర్గ ఎస్‌టి ఉద్యోగులు, అధికారులు, సంఘంలో వివిధ స్థాయిల్లో పనిచేస్తున్న కళావతి, సుశీల, రాధా, సత్య భారతి, మణి, రమేష్, బాలరాజు, శ్రీనివాసరావు, వసంత్, జామ్లా, మధు, బుజ్జి, పేరయ్య, సురేష్, పుల్లారావు, స్నేహిత్ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి

ప్రజాశక్తి - మండవల్లి


అంగన్‌వాడీ కేంద్రాల వద్ద శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లుతున్న సిబ్బంది

పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే వ్యాధులు దరిచేరవని సర్పంచి మెండ ఝాన్సీ తెలిపారు. మండవల్లిలో ఆరు అంగన్వాడీ కేంద్రాల వద్ద మంగళవారం పరిశుభ్రం చేయించి సిబ్బందితో బ్లీచింగ్ చల్లించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల చుట్టూ అపరిశుభ్ర వాతావరణం నెలకొనడంతో పాటు పిచ్చి మొక్కలు బాగా పెరిగిపోయాయన్నారు. దీంతో వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని అంగన్వాడీ చిన్నారులకు ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా ఉండే విధంగా అంగన్వాడీ కేంద్రాల పరిసరాలను శుభ్రం చేయించినట్లు చెప్పారు. శుభ్రం చేసిన వెంటనే పూర్తి స్థాయిలో బ్లీచింగ్ చల్లించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెండ సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

పోలవరం మాజీ ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజు


బాధితుడిని పరామర్శిస్తున్న మాజీ ఎంఎల్‌ఎ బాలరాజు

ప్రజాశక్తి - టి.నరసాపురం

వైసిపి కార్యకర్తలకు అండగా ఉంటామని, అధైర్యపడొద్దని పోలవరం మాజీ ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజు భరోసా ఇచ్చారు. కొంతమంది దాడిలో చేయి విరిగిన మండలంలోని మల్లుకుంట గ్రామంలో వైసిపి కార్యకర్త సాయల నాగేంద్రను మాజీ ఎంఎల్‌ఎ బాలరాజు మంగళవారం పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధైర్య పడొద్దని, అందరికీ అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కూటమికి చెందిన వ్యక్తులు వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులపై దాడులు చేయాలని చూస్తే సహించేది లేదని హెచ్చరించారు. కూటమికి ప్రజలు అధికారమిచ్చింది వైసిపి నాయకులు, కార్యకర్తలపై దాడులు చేయడానికి కాదన్నారు. ప్రజలకు మంచి చేయాలని, సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలన్నారు. రాష్ట్రంలో వైసిపిపై జరుగుతున్న దాడులకు చంద్రబాబు, పవన్ కళ్యాణ్ బాధ్యత వహించాలన్నారు. జగన్మోహన్‌రెడ్డి నాయకత్వంలో పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తుమ్మూరి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

కూలి రేట్లు పెంచాలని ప్రదర్శన

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఐఎఫ్‌టియు అనుబంధ చుట్టల కార్మికుల సంఘం ఆధ్వర్యంలో కూలి రేట్లు పెంచాలని కోరుతూ మంగళవారం ఏలూరు టూ టౌన్ ఏరియా చేపలతూము సెంటర్ నుంచి బోస్ బొమ్మ సెంటర్ మీదుగా తిరిగి చేపల తూము సెంటర్ వరకు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టియు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు, ఏలూరు నగర ప్రధాన కార్యదర్శి యర్రా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఏలూరు నగరంలో పనిచేస్తున్న చుట్టల కార్మికుల కూలి రెట్ల పెంపుదల కాలపరిమితి జూలై 14వ తేదీతో ముగుస్తుం దన్నారు. టుబాకో మ్యాన్‌ఫ్యాక్చర్స్ అసోసియేషన్ వారు సానుకూలంగా వ్యవహరించి కూలిరెట్ల పెంపుదల చేయాలని కోరారు. ఏలూరు నగరంలో పనిచేస్తున్న చుట్టల కార్మిక వర్గం ఐక్యంగా ఉండి చట్టబద్ధమైనటువంటి సౌకర్యాలు, సదుపాయాలు సాధించుకునే విషయంలో సంఘటితంగా వ్యవహరించాలని కార్యవర్గానికి పిలుపుని చ్చారు. పెరిగిన నిత్యవసరాల ధరలకు అనుకూలంగా కూలి రెట్ల పెంపుదల చేయాలని కోరుతూ నాలుగు రకాల డిమాండ్స్‌తో కూడిన పత్రాన్ని టుబాకో మ్యాన్‌ఫ్యాక్చర్స్ అసోసియేషన్‌కు ఇచ్చారు. తక్షణం చర్చల ప్రక్రియ మొదలు పెట్టాలని యజమానులను డిమాండ్ చేశారు. టుబాకో మ్యాన్‌ఫ్యాక్చర్స్ అసోసియేషన్ స్పందిస్తూ త్వరలో కూలి రెట్ల పెంపుదల చర్చల ప్రక్రియను మొదలు పెడతామని చుట్టల కార్మిక వర్గానికి హామీ ఇచ్చింది. ఈ కార్యక్రమంలో కార్మికులు సీత, కృష్ణవేణి, మహాలక్ష్మి, రమ్య, బిందు, శ్యామల పాల్గొన్నారు.


ఎంఎల్‌ఎకు చిత్రపటం అందిస్తున్న ఇఒ

చినవెంకన్నను దర్శించుకున్న వెంకటరాజు

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

గోపాలపురం ఎంఎల్‌ఎ మద్దిపాటి వెంకటరాజు అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం తర్వాత మొదటిసారి చినవెంకన్నను దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికారు. ఎంఎల్‌ఎ వెంకటరాజు స్వామివారిని దర్శించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వదించి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి వేండ్ర త్రినాథరావు ఎంఎల్‌ఎను శాలువాతో సత్కరించి స్వామి వారి ఫొటోను అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మొగతడకల శ్రీనివాసరావు, మెల్లిపెద్ది వెంకటేశ్వరరావు, పోలిన శ్రీను, సుంకవల్లి బ్రహ్మయ్య, టిడిపి మండలాధ్యక్షులు లంక సత్తిపండు, ఏపురి దాలయ్య, పాల్గొన్నారు.


ఫిజియోథెరపీ చేస్తున్న ఉపాధ్యాయులు

వ్యాయామంతో ఆరోగ్యం

ప్రజాశక్తి - ముసునూరు

ప్రతిరోజు నిత్యం వ్యాయామం చేస్తే అవసరాలు గల పిల్లలు ఆరోగ్యకరంగా ఉంటారని ఫిజియోథెరపిస్ట్ జి.ప్రశాంతి చెప్పారు. మండలంలోని రమణక్కపేట గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అవసరాలు గల పిల్లలకు తమ తల్లిదండ్రులతో కలిసి అవగాహన కల్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతిరోజు వ్యాయామం చేసినట్లయితే ఆరోగ్యకరంగా ఉండటంతో పాటు మానసిక ఒత్తిడి లేకుండా ఉంటారని, అవసరాల గల పిల్లలను లోపం ఉన్న వాటిని ఎత్తి చూపించినట్లయితే వారు మరి కుంగిపోతారన్నారు. వారితో ఎప్పుడూ కూడా తల్లిదండ్రులతో పాటు విద్యార్థులు, స్నేహితులు, తమ బంధువులు ధైర్యపరిచేవిధంగా మాట్లాడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐఆర్‌టియు ఉపాధ్యాయులు డిఎంవి.లక్ష్మీ నారాయణ, జె.నాగమల్లేశ్వరి పాల్గొన్నారు.